# అటవీ ప్రాంతంలో బీటీ డబుల్ రోడ్డు



సిరికొండ నుంచి చీమన్‌పల్లి వరకు నూతనంగా నిర్మించిన బీటీ డబుల్ రోడ్డు

- రూ. 7 కోట్లతో నిర్మాణం
- హర్షం వ్యక్తంచేస్తున్న ప్రయాణికులు

సిరికొండ, డిసెంబర్ 7 : సిరికొండ – చీమన్‌పల్లి అటవీ ప్రాంతంలో గుంతలమయంగా ఉన్న సింగిల్ రోడ్డు.. రూరల్ మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ కృషితో బీటీ డబుల్ రోడ్డుగా మారింది. సిరికొండ నుంచి చీమన్‌పల్లికి అటవీ మార్గం గుండా వెళ్లే దారిలో 7 కిలోమీటర్ల రూ.7 కోట్లతో డబుల్ బీటీ రోడ్డును నిర్మించారు. అటవీ ప్రాంతంలో గుంతలు, ఎత్తు పల్లాలు ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొనేవారు. రోడ్డు నిర్మాణంలో భాగంగా ఎదురు గడ్డలను తొలగించడం, బీటీ రోడ్డును నిర్మించడంతో ప్రయాణం సులభతరంగా మారింది. గతంలో చీమన్‌పల్లి నుంచి మండలకేంద్రానికి వెళ్లాలంటే 45 నిమిషాల సమయం పట్టేంది. ఈ రోడ్డు గుండా ప్రయాణిస్తే 10 నిమిషాల్లో లోపే మండలానికి చేరుకోగలుగుతుఆన్నమని ప్రయాణికులు, గ్రామస్తులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

## రైతుబంధు పథకం కొనసాగించాలి

### మండల సర్వసభ్య సమావేశంలో తీర్మానం



మాట్లాడుతున్న ఎంపీపీ సావిత్రీ రాజేశ్వర్

బోధన్ రూరల్, డిసెంబర్ 7: మండల పరిషత్ కార్యాలయంలో గురువారం ఎంపీపీ బుద్దె సావిత్రీ రాజేశ్వర్ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వివిధ శాఖల వారీగా మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతి నివేదికలను సంబంధిత అధికారులు చదివి వినిపించారు. పలు సమస్యలపై సభ్యులు అధికారులను నిలదీశారు. పత్తేపూర్ సర్పంచ్ అమీర్ మాట్లాడుతూ నిజాంసాగర్ కాలువ నీరు తమ గ్రామం వరకు ఎందుకు రావడం లేదని ఇరిగేషన్ ఏఈ శ్రీనివాస్‌ని ప్రశ్నించారు. ఈ విషయమై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. రైతు బంధు పథకాన్ని కొనసాగిస్తారా లేదా అని వ్యవసాయ శాఖ అధికారులను ప్రజాప్రతినిధులు అడిగారు. ఈ పథకం ఆగస్టు వరకు కొనసాగుతుందని అధికారులు తెలిపారు. ఈ సమావేశానికి మండల స్థాయి అధికారులు రాకుండా కింద స్థాయి అధికారులు వస్తున్నారని, సమస్యలు ఉంటే ఎవరికి చెప్పుకోవాలని ప్రజాప్రతినిధులు ప్రశ్నించారు. గ్రామాల అభివృద్ధికి అధికారులు సహకరించాలని సభ్యులు కోరారు. అనంతరం రైతు బంధు పథకం కొనసాగించాలని సభ తీర్మానం చేసింది. సమావేశంలో బోధన్ ఎంపీడీవో పర్బన్న, ఎంపీవో మధుకర్, వైస్ ఎంపీపీ కోట గంగారెడ్డి తోపాటు ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణ్‌పల్లిలో చోరీ

జక్రాన్‌పల్లి, డిసెంబర్ 7: మండలంలోని బ్రాహ్మణ్‌పల్లిలో దామర కృష్ణ అనే ఆటోడ్రైవర్ ఇంట్లో చోరీ జరిగింది. ఏఎస్సై సుశీల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. దామర కృష్ణ మూడు రోజుల క్రితం పచ్చలనడ్కుడ గ్రామానికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. గురువారం ఉదయం 6 గంటలకు ఇంటి తాళం పగులగొట్టి ఉండడాన్ని కృష్ణ అన్న గమనించి సమాచారం అందించాడు. వారు ఇంటికి వచ్చి చూసి చోరీ జరిగినట్లు గుర్తించారు. బీరువాలోని 7 మాసాల బంగారం, ఒక కెమెరా చోరీకి గురైనట్లు బాధితులు తెలిపారు. కృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

### సీఎం ప్రమాణ స్వీకారానికి తరలిన నాయకులు



రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డితో ఇందల్వాయి మండల కాంగ్రెస్ నాయకులు

డిచ్‌పల్లి/ సిరికొండ, జక్రాన్‌పల్లి / ఇందల్వాయి, డిసెంబర్ 7 : హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్ స్టేడియంలో గురువారం నిర్వహించిన సీఎం రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకార కార్యక్రమానికి జిల్లాలోని వివిధ మండలాలు గ్రామాల నుంచి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ప్రత్యేక వాహనాల్లో నాయకుల ఆధ్వర్యంలో కార్యకర్తలు బయల్దేరి వెళ్లారు. ఇటీవల రూరల్ ఎమ్మెల్యేగా గెలుపొందిన భూపతిరెడ్డిని కలిసి సన్మానించారు.



ఏర్గట్లలో అయ్యప్ప స్వామి పల్లకీ సేవ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

## ఏర్గట్లలో అయ్యప్ప స్వామి ఆరట్టు

ఏర్గట్ల,డిసెంబర్7: మండల కేంద్రంలో స్థానిక అయ్యప్ప స్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప స్వామి ఆరట్టు, పల్లకీ సేవ కార్యక్రమం గురువారం ఘనంగా నిర్వహించారు. అయ్యప్ప స్వామి ప్రతిమ, పల్లకీని డీజే, మంగళహారతులతో, నృత్యాలు చేస్తూ గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో అయ్యప్ప స్వాములతో పాటు, గురు స్వాములు, గ్రామాల నుంచి అయ్యప్ప మాలధారులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



మాక్లూర్‌లో సంబురాలు నిర్వహిస్తున్న కాంగ్రెస్ శ్రేణులు

నందిపేట్/ మాక్లూర్/రెంజల్, డిసెంబర్7: నందిపేట్ మండలంలోని శాపూర్‌లో గురువారం కాంగ్రెస్ కార్యకర్తలు సంబురాలు నిర్వహించారు. సీఎంగా రేవంత్‌రెడ్డి ప్రమాణ స్వీకారం చేసినందున ప్రధాన కూడలి వద్ద అంబేద్కర్, ఇందిరాగాంధీ, మహాత్మాగాంధీ, వివేకానంద చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. పటాకులు కాల్చి సంబురాలు నిర్వహించారు. మాక్లూర్ మండల కేంద్రంతోపాటు, మామిడిపల్లి, కల్లడి, మాదాపూర్, గుత్ప, మానిక్‌బండార్, ముల్లంగి(బీ), కొత్తపల్లి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ శ్రేణులు సంబురాలు నిర్వహించాయి. రెంజల్ మండల కేంద్రంతోపాటు సాటాపూర్, తాడ్‌బిలోలి, కందకుర్తి తదితర గ్రామాల్లో కాంగ్రెస్ నాయకులు సంబురాలు నిర్వహించారు.

# ఘనంగా అయ్యప్ప స్వామి మహా పడిపూజ




పడిపూజ నిర్వహిస్తున్న మాలధారులు



భిక్ష స్వీకరిస్తున్న అయ్యప్ప స్వాములు

**అయ్యప్ప నామస్మరణతో మార్మోగిన మద్నూర్**

మద్నూర్, డిసెంబరు 7: అయ్యప్పస్వామి సామూహిక మండల మహాపడిపూజను గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. మాలధారులు, భక్తులకు మధ్యాహ్నం భిక్షను ఏర్పాటుచేశారు. సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన పూజ రాత్రి 12 గంటలవరకు కొనసాగింది. 11రకాల పదార్థాలతో స్వామివారికి అభిషేకం చేశారు. భజనలు, అయ్యప్ప నామస్మరణతో పడిపూజా ప్రాంగణం మార్మోగింది. బిచ్కుందకు చెందిన దత్తు పంతులు ఆధ్వర్యంలో పడిపూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు దాతలను అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. మండలంతోపాటు బిచ్కుంద, జుక్కల్, పిట్లం, బాన్సువాడ, బీర్కూర్, కోటగిరి నుంచి అయ్యప్ప మాలధారులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. గురుస్వాములు గడ్డం సాయిలు, లక్ష్మణ్ ఆధ్వర్యంలో పడిపూజ కార్యక్రమం చేపట్టారు.

### అందుబాటులో వరి విత్తనాలు

బిచ్కుంద, డిసెంబర్ 7: మండల కేంద్రంలోని రైతు సేవా సహకార సంఘంలో వరి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని రైతు సేవా సహకార సంఘం అధ్యక్షుడు నాల్చార్ బాలు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ సీడ్స్‌కు సంబంధించిన ఎంటీయూ 1010 రకం 25 కేజీల బస్తాను రూ.880, కేఎన్‌ఎం 1638 రకం 25 కేజీల బస్తాను రూ.995కు విక్రయిస్తున్నట్లు తెలిపారు. అవసరం ఉన్న రైతులు సొసైటీకి వచ్చి తీసుకెళ్లాలని సూచించారు.

### సాయిబాబా ఆలయంలో భక్తుల సందడి



ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

నస్రుల్లాబాద్, డిసెంబర్ 7 : నస్రుల్లాబాద్ మండలంలోని నెమ్లి సాయిబాబా ఆలయంలో గురువారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు భక్తులు సత్యనారాయణ వ్రతాలు చేశారు. సాయినాథుడికి అర్చనలు, అభిషేకాలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.